నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 11 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 10 : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి కార్మిక నాయకులతో కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు దుర్గం వెంకటేశ్, ధర్మయ్య, మల్లయ్య, లక్ష్మణ్, వెంకటేశ్, సంతోష్, శంకర్, గోపాల్, అంజయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్మకురి చిరంజీవి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సీసీసీ నస్పూర్, జూన్ 10: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 119లో గల ప్రభుత్వ భూమిని ఇటీవల కొందరు చదును చేశారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించారు. మంచిర్యాల ఆర్డీవో, నస్పూర్ తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ సిబ్బంది ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ నస్పూర్‌లో చాలా వరకు ప్రభుత్వ భూములు వివాదాస్పదంగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి కాపాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మాంతయ్య పాల్గొన్నారు.

అటవీ దారులకు త్వరలో మోక్షం!

● మారుమూల గ్రామాలకు 24 రోడ్లు మంజూరు ● అటవీశాఖ అనుమతి లేక కొన్ని.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మరికొన్ని పనులకు బ్రేక్

● తాజాగా ఫారెస్ట్ అధికారులతో సమీక్షించి చర్చించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి ● అనుమతులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : అటవీశాఖ అనుమతులు లేక మారుమూల గ్రామాలకు నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాలకు త్వరలో మోక్షం కలగనుండగా, అడవిబిడ్డల దశాబ్దాల కల నెరవేరే అవకాశమున్నది. జిల్లాలోని మారుమూల గ్రామాలకు 24 రోడ్లు మంజూరు కాగా, కొన్ని అటవీ శాఖ అనుతులు లేక.. మరికొన్ని కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ విషయమై సోమవారం జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అటవీశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో సాగుతున్న దాదాపు 24 రోడ్ల పనులు త్వరలో పూర్తిచేసేలా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన 12 రోడ్ల నిర్మాణాలకు అటవీశాఖ అనుమతి లేక పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి అనుమతి రావాల్సి ఉందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ తెలిపారు. వీటిలో దాదాపు 11 పనులు కాంట్రాక్టర్ల వద్దనే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఒక పని రాష్ట్ర కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇక పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన 7 రోడ్లకుగాను 5 రోడ్లు కాంట్రాక్టర్ల వద్ద, 2 పనులు మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఐటీడీఏ ద్వారా గిరిజన గ్రామాలకు చేపట్టిన 5 రోడ్లు కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 6 జియో సెల్ టవర్ల నిర్మాణాలు 6 చేపట్టగా, వీటిలో 5 కాంట్రాక్టర్ల వద్ద, ఒకటి జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని తెలిపారు.

అనుమతులకు అటవీశాఖ సిద్ధం

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న రోడ్లు, వివిధ రకాల అభివృద్ధి పనులకు అనుమతులు ఇచ్చేందుకు అటవీ శాఖ సిద్ధంగా ఉందని, అయితే ఆయా శాఖల నుంచి అనుమతుల కోసం దరఖాస్తులు సరైన విధంగా ఉంటే వెంటనే ఇచ్చేందుకు వీలుకలుగుతుందని జిల్లా అటవీ శాఖ అధికారి తెలిపారు. అటవీ ప్రాంతంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు కావాల్సిన అనుమతులను పనులు ప్రారంభించే కంటే ముందే టెండర్ల దశలోనే తీసుకోవాలని ఆయన సూచించారు. వివిధ శాఖల అధికారులు ఈ విషయం తెలిసి కూడా పనులు ప్రారంభిస్తున్నారని, దీంతోనే అటవీ చిక్కులు వస్తున్నాయని, అటవీ శాఖలను దోషిగా ప్రజల ముందు ఉంచుతున్నారని అన్నారు. అటవీ ప్రాంతాల్లో చేపడుతున్న పనులకు సంబంధించి అనుమతుల కోసం త్వరితగతిన దరఖాస్తులు పంపాలని సూచించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో అన్ని శాఖల అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనులు ప్రారంభించిన తర్వాత.. మధ్యలోనే ఆగిపోతే ప్రజలతో పాటు అధికారులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుదన్నారు. అసరమైన చోట్ల తగిన విధంగా ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని అన్నారు. మారుమూల గ్రామాలకు ఆగిపోయిన రోడ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించేలా అటవీ, ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవతీసుకోవాలని అన్నారు.

అటవీ ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్

కాంట్రాక్టర్‌కు మెమో

● 'నమస్తే' కథనానికి స్పందన

నమస్తే తెలంగాణలో వచ్చిన కథనం

లక్షెట్టిపేట, జూన్ 10 : లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానలో రోగులకు ఆహారమందించడం లేదంటూ సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'ప్రభుత్వ దవాఖానలో పస్తులు' పేరిట కథనం ప్రచురితమవ్వగా అధికారులు స్పందించారు. సోమవారం దవాఖాన సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్ సదరు కాంట్రాక్టర్ మల్లేశ్‌కు మెమో జారీ చేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో కూడా మెనూ సరిగ్గా పాటించడం లేదన్న విషయమై సదరు కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేశామని, ఇది రెండోసారి అన్నారు. డ్యూటీలో ఉన్న సిబ్బంది కూడా ప్రతి రోజూ పేషెంట్స్‌కి ఇచ్చే డైట్ తప్పకుండా పరిశీలించాలని, రెండు రోజుల్లో ఈ విషయమై పూర్తి నివేదిక అందజేయాలని కాంట్రాక్టర్‌తో పాటు సిబ్బందిని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. మరోసారి ఇలాంటివి పునారావృతమయితే కాంట్రాక్టర్‌ను తొలగిస్తామన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బస్ డ్రైవర్లు, ఏఐటీయూసీ నాయకుడు ఉపేందర్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● హైర్ బస్సు డ్రైవర్ల డిమాండ్ ● నల్లబ్యాడ్జీలతో నిరసన

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 10 : టీజీ ఆర్టీసీలో పనిచేస్తున్న హైర్ బస్సు డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని బస్ డిపోలో హైర్ బస్సు డ్రైవర్లతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైర్ బస్సు డ్రైవర్లను ఆర్టీసీ, ప్రభుత్వం శ్రమదోపిడీకి గురి చేస్తున్నదని, త్వరితగతిన వారి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో 14వ తేదీ తర్వాత ఏ రోజైనా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్, ఆసిఫాబాద్ డిపో అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు భాస్కర్, తేజ, విజయ్, సాయి కృష్ణ, సంతోష్, తిరుపతి, షకీర్, రషద్, దశరథం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో చెస్ అసోసియేషన్ నాయకులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

రెబ్బెన, జూన్ 10 : హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు పలువురు క్రీడాకారులు ఎంపికైన్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. గోలేటిటౌన్‌షిప్‌లో గల టీబీజీకే ఎస్ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలలో ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అండర్-9 విభాగంలో దేవాన్స్, శ్రీకాంత్, తన్విక, వినూత్న, శరత్, అండర్-13 విభాగంలో జాన్సన్, భార్గవ్, మేఘన, కృషిక, కౌశిత్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న బ్రహ్మానందం

వేతనాలు చెల్లించాలని ధర్నా

నస్పూర్, జూన్ 10 : జీవో నంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ ముందు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ జిల్లాలోని 8 పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో సుమారు 50 మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, వీరికి సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెలా వేతనాలు చెల్లించడం లేదని, అధికారులను ప్రశ్నిస్తే బడ్జెట్ లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీవో నంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా పదో తేదీలోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంపత్, రాజేశ్వరి, అనిత, మల్లేశ్వరి, సునీత, లక్ష్మి, పద్మ, ప్రేమలత, అనసూర్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

నస్పూర్, జూన్ 10 : జిల్లాలో మిషన్ భగీరథకు సంబంధించి ఇంటింటి నల్లా కనెక్షన్‌ల సర్వే ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఈఈ వెంకటేశ్వర్లుతో కలిసి అధికారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేను మొబైల్ యాప్ ద్వారా పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. నల్లా కనెక్షన్లు కలిగిన నివాసాలు, ఇంకా ఇవ్వాల్సిన కనెక్షన్లు, ఇతర వివరాలతో కూడిన సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి యజమానితో పాటు కుటుంబ సభ్యులు ఆధార్ నంబర్లు, కులం, ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు, నీటి సరఫరాకు సంబంధించి ఫొటోలను యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, అదనపు పంచాయతీ అధికారి దత్తరావు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ట్రైనింగ్ రీసోర్స్ పర్సన్లు మల్లేశ్, రాజేందర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంచిర్యాల, మందమర్రి, నెన్నెల, భీమిని, చెన్నూరు, ఆరేగూడ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి దరఖాస్తులు అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు.

అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

సింగరేణి పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రి, జూన్ 10 : మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఒకటి నుంచి పదో తరగతి వరకు 200 సీట్లు ఖాళీగా ఉన్నాయని, మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ నెల 12 నుంచి జూలై 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో అన్ని వసతులతో పాటు బస్సు సౌకర్యం ఉందని, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నామని, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, మినరల్ వాటర్ సౌకర్యం ఉందని తెలిపారు.

నేడు స్థాయీ సంఘాల సమావేశం

హాజీపూర్, జూన్ 10 : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం స్థాయీ సంఘాల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గణపతి శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు స్థాయి కమిటీ -2 (గ్రామీణాభివృద్ధి), 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థాయి కమిటీ -3 (వ్యవసాయం), మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు స్థాయి కమిటీ -4 (విద్య, వైద్య సేవలు), మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు స్థాయి కమిటీ -5 (మహిళా సంక్షేమం), మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు స్థాయి కమిటీ -6 (సాంఘిక సంక్షేమం), సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు స్థాయి కమిటీ - 7 (నిర్మాణ పనులు), స్థాయి కమిటీ-1 (ప్రణాళిక, ఆర్థిక) సమావేశాలు నిర్వహిస్తామని, సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎస్సారెస్పీ-1 గనిపై మొక్క నాటుతున్న ఇన్‌చార్జి జీఎం పరుషోత్తంరెడ్డి

పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, అధికారులు

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి

ఇన్‌చార్జి జీఎం పురుషోత్తంరెడ్డి

శ్రీరాంపూర్, జూన్ 10 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం పురుషోత్తంరెడ్డి కోరారు. సోమవారం శ్రీరాంపూర్ ఎస్సారెస్పీ-1 గనిపై హరితహారంలో భాగంగా ఏజెంట్ గోపాల్‌సింగ్‌తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని రక్షిస్తామంటూ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా యాజమాన్యం పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతుందని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించాలని కోరారు. గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య, ఏరియా ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, మేనేజర్ విజయ్‌కుమార్, సేఫ్టీ ఆఫీసర్ చంద్రమౌళి, ఈఈ శంకరయ్య, రాజేందర్, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి

ఎమ్మెల్యే వివేక్‌ను కలిసిన ముదిరాజ్ కులస్తులు

చెన్నూర్, జూన్ 10: చెన్నూర్ పట్టణంలోని పెద్ద చెరువు చేపల పెంపకానికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని ముదిరాజ్ కులస్తులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వివేక్‌ను సోమవారం కలిసి తమ గోడును చెప్పుకున్నారు. పెద్ద చెరువులో చేపల పెంపకం విషయంలో కొద్ది రోజులుగా గంగపుత్రులు, ముదిరాజ్‌ల మధ్య వివాదం నడుస్తున్నది. పెద్ద చెరువులో గంగపుత్రులు మత్స్యకార సొసైటీని ఏర్పాటు చేసుకొని చేపల పెంపకం చేపడుతున్నారు. పూర్వ కాలం గంగపుత్రులు, ముదిరాజ్‌లు కలిసి పెద్ద చెరువులో చేపలు పట్టుకునే వారు. ప్రస్తుతం కూడా ముదిరాజ్‌లకు పెద్ద చెరువులో చేపల పెంపకానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదాన్ని పరిష్కరించాలని ఎమ్మెల్యే వివేక్‌ను ముదిరాజ్ కులస్తులంతా కలిసి విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వివాదాన్ని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివేక్ హామీ ఇచ్చారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

● వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి ● పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 10 : వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంటువ్యాధులైన అతిసార, కలరా, మలేరియా, డెంగీ ఇతర వ్యాధుల వ్యాప్తి నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నిరోధించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలని, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఫాగింగ్ చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. పిడుగు పాటుకు గురైన వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించి కాపాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా గుంతలను పూడ్చి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, దీపక్ తివారీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679